www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 24 నవంబరు 2022

5

పశ్చిమ గోదావరి



16 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని 19 మండలాల పరిధిలో 293 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వేపనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 16 మండలాల్లోని 16 గ్రామాల్లో సర్వే పనులు చేపట్టి నూరు శాతం పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా భూయజమానులకు భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో బుధవారం ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగిలిన గ్రామాల్లో పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. 16 గ్రామాల్లోని 8,663 మంది యజమానులకు భూహక్కు పత్రాలను అందజేయడానికి సిద్ధం చేశామన్నారు. తాడేపల్లిగూడెం, పాలకోడేరు, ఆకివీడు మండలాల్లో భూ రీసర్వే పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా పాల్గొన్నారు.

సాగునీరు పుష్కలమే..!

- దాళ్వాలో పూర్తి ఆయకట్టుకు నీరు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4.60 లక్షల ఎకరాల్లో సాగు
- 101 టిఎంసిల గోదావరి నీరు అందుబాటులో ఉన్నట్లు లెక్కలు
- 30వ తేదీ నుంచి సాగునీరు విడుదలకు సన్నాహాలు
- జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం ఊసే కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరిలో పూర్తిస్థాయిలో నీరు అందుబాటులో ఉండటంతో దాళ్వాలో రెండు జిల్లాల్లోనూ పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ప్రతియేటా సాగునీటి సరఫరాపై పెద్దఎత్తున చర్చ సాగేది. పూర్తి ఆయకట్టుకు నీరందించాలా వద్దా.. అందిస్తే ఏవిధంగా అందించాలనే దానిపై తర్జనభర్జనలు జరిగేవి. ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేదని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాళ్వాలో 4.60 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4.36 లక్షల ఎకరాల ఆయకట్టులో రైతులు పంటను సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలంటే దాదాపు 83 టిఎంసిలు నీరు అవసరం. ప్రతియేటా నవంబర్ నెలాఖరు వచ్చేసరికి గోదావరిలో నీటిలభ్యత లెక్కల ప్రకారం 61 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉండేది. ఈ నీరు కేవలం 74 శాతం ఆయకట్టుకు మాత్రమే సరిపోతుందని, మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలంటే కష్టమని అధికారులు తేల్చేవారు. జిల్లా సాగునీటి సలహామండలి సమావేశాల్లో దీనిపై పెద్దఎత్తున చర్చ సాగేది. దీంతో సీలేరు జలాలను లెక్కలుగట్టి వంతులవారీ విధానంలో పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించేవారు. అడ్డుకట్టలు ఎక్కడ వేయాలి వంటి ప్రణాళికలు రూపొందించేవారు. జిల్లాలో 11 ప్రధాన కాలువలు, 300కు పైగా పిల్లకాలువల ద్వారా సాగునీటి సరఫరా సాగుతోంది. దీంతో ఎక్కడ ఎటువంటి చర్యలు తీసుకోవాలో చర్చించేవారు. ఈ ఏడాది అటువంటి క్లిష్టపరిస్థితులు లేవని సాగునీటి లెక్కలు చెబుతున్నాయి.



ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహాల లెక్కల ప్రకారం 101 టిఎంసిల నీరు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తేల్చారు. దీంతో దాళ్వాకు సాగునీటి కొరత ఉండదని తేలిపోయింది. జనవరి తర్వాత నీటి ప్రవాహాల ఆధారంగా వంతుల వారీ విధానం అమలు చేయాలా వద్దా అనేది నిర్ణయించే అవకాశం ఉంది. సాగునీటి కొరత లేదని తెలియడంతో రైతులు సైతం దాళ్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు.

30న సాగునీరు విడుదలకు సన్నాహాలు

ప్రతియేటా దాళ్వాకు సాగునీటి సరఫరాపై జిల్లాలో సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితోపాటు జిల్లాలోని మంత్రులు, ఎంఎల్‌ఎలు, కలెక్టర్, జెసితోపాటు అధికారులంతా పాల్గొంటారు. సాగునీటి సరఫరా, సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ నెల 30న దాళ్వాకు సాగునీరు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే జిల్లాలో మాత్రం ఇప్పటికీ సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహణపై ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. ఈ నెల 30న జిల్లాలో ఐఎబి సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. అదే రోజు సాగునీటిని విడుదల చేయనున్నట్లు తూర్పుగోదావరి జిల్లా సమావేశంలో ప్రకటించడంతో సమావేశం నిర్వహిస్తారా అనే అనుమానం కలుగుతోంది.

వెంటాడుతున్న ఆధునికీకరణ సమస్య

గడిచిన మూడేళ్లలో జిల్లాలో పంట కాలువలకు సంబంధించి ఎటువంటి ఆధునికీకరణ పనులూ జరగలేదు. దీంతో చాలా పంట కాలువలు మెరకతేలిపోయి ఉన్నాయి. దాళ్వాలో సాగునీరు కిందకు పారక ప్రతియేటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈసారీ అటువంటి ఇబ్బందులు తప్పవని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పవా అనే పరిస్థితి నెలకొంది. సాగునీటికి ఇబ్బంది లేకుండా అత్యవసర పనులు వెంటనే చేయాలని రైతులు కోరుతున్నారు.

పిఎంఎంఎస్‌వైపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పిఎంఎంఎస్‌వై) ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో పిఎంఎంఎస్‌వై పథకం అమలుపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎంఎంఎస్‌వై పథకం ప్రయోజనాలపై మత్స్యకార గ్రామాలతో పాటు మత్స్య సంపద అమ్మకందదారుల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. డిఆర్‌డిఎ అధికారులు మత్స్యకార గ్రామాలైన తూర్పుతాళ్ల, పెదమైనవానిలంక, చినమైనవానిలంక, పల్లెపాలెం, గొల్లవానితిప్ప తదితర గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన వారికి రుణాల మంజూరులో తోడ్పటు అందించాలని సూచించారు. జిల్లాలో తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో సముద్ర తీరం ఉందని, పిఎంఎంఎస్‌వైకు కేవలం 130 దరఖాస్తులే అందడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఈ పథకంపై విస్తృత ప్రచారం కొరవడిందన్నారు. ఎక్కువ మొత్తంలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి ముందుకొచ్చేలా ప్రోత్సహించాలన్నారు. ఇప్పటివరకు ఒదిన దరఖాస్తులను ఈక్రాప్ డేటాతో సరిచూడాలని కమిటీ లో ఉన్న మెంబర్లను ఆదేశించారు. మొబైల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు యువతను ప్రోత్సహించాలన్నారు. ఫిష్ ఆంధ్ర పేరుతో మినీ ఫిష్ అవుట్‌లెట్లను పెద్దమైనవానిలంక, ముత్యాలపల్లిలో ఇప్పటికే ఏర్పాటు చేసి కొనసాగుతున్నాయని, మిగతా ప్రాంతాల్లో కూడా ఈ విధమైనవి ఏర్పాటు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ కెఎస్‌వి.నాగలింగాచార్యులు, జిల్లా నీటిపారుదల శాఖాధికారి పి.నాగార్జునరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, లీడ్‌బ్యాంకు మేనేజర్ ఎన్‌వివి.రమణ, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎ.చల్లారావు, ఉండి కెవికె సైంటిస్ట్ ఎ.శ్రీనివాసరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతపల్లి లక్ష్మి, దిగుపాటి జ్యోతి మాట్లాడుతూ ఆశా వర్కర్లపై పని ఒత్తిడి బాగా పెరిగిందని, మెటీరియల్‌ను తామే తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలని చెబుతున్నారని, రాత్రులు కూడా పడిగాపులు పడి ఉండాల్సి వస్తుందని తెలిపారు. ఎప్పుడైనా సెలవు అడిగితే ఎవరికీ పట్టనట్లు వంతులు వేసుకుంటున్నారని, దీనివల్ల ఆశాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జిల్లా అధికారులు చొరవ తీసుకుని జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి లారెన్స్ కుమారి, జిల్లా కమిటీ సభ్యులు షరీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.



జిల్లా వైద్యాధికారికి వినతి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

సిఐటియు రాష్ట్ర మహాసభ

జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో..

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరగనున్న సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ పిలుపునిచ్చారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో విరాళాల సేకరణ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ భీమవరంలో 2023 జనవరి 2, 3, 4 తేదీల్లో జరుగనున్నాయని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమంలో రెండో బార్డోలీగా పేరొందిన భీమవరం పట్టణంలో మొట్ట మొదటిసారిగా రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నామని తెలిపారు. 1970లో సిఐటియు ఏర్పడినప్పటి నుండి ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలతో పాటు దేశ ప్రజల ప్రయోజనాల కోసం పని చేస్తోందని తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు, ఉద్యోగులకు నష్టం చేసే ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధికి రైస్‌మిల్లు, స్పిన్నింగ్, పేపర్, ఆయిల్, షుగర్, జ్యూట్ వంటి చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు సంక్షేమ చట్టాల అమలు కోసం సిఐటియు నిరంతరం కృషి చేస్తోందన్నారు. నిరంతరం ఉద్యోగ, కార్మికుల సమస్యలపై పనిచేస్తున్న సిఐటియు రాష్ట్ర మహాసభకు తాడేపల్లిగూడెంలో 4 దళాల సభ్యులు ఇంటింటికీ మాస్ క్యాంపెయిన్‌కు వస్తున్నారని తెలిపారు. పట్టణ ప్రజలు ఆర్థిక సహకారం అందించి మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి జి.నాగేశ్వరరావు, ఎం.రాజు, సిహెచ్.రాము, పి.శ్రీను, పి.నాగేంద్రబాబు, ఆర్‌వి.నాగేంద్ర, సిహెచ్.సత్యనారాయణ, టి.శ్రీను, వి.అప్పారావు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఒల సంఘం నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు విఆర్‌ఒలవినతి

ప్రజాశక్తి - భీమవరం

విఆర్‌ఒల సమస్యలు తక్షణం పరిష్కరించాలని విఆర్‌ఒల సంఘం నేతలు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కోరారు. ఈ మేరకు కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో విఆర్‌ఒలు తీవ్ర పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ సచివాలయాల్లో సదుపాయాలు, స్టేషనరీ, కంప్యూటర్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ సదుపాయాలపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సర్వే విషయంలో విఆర్‌ఒలకు ఖర్చుల నిమిత్తం ఇవ్వాల్సిన సొమ్ము వెంటనే అందజేయాలని సర్వే శాఖ ఎడిని ఆదేశించారు. కార్యక్రమంలో సంఘం భీమవరం డివిజన్ అధ్యక్షులు కెనడీ, నర్సాపురం డివిజన్ అధ్యక్షులు కె.సత్తిబాబు, నాయకులు సునీల్, రాజు, సోడి పిండి అప్పారావు, టి.దానయ్య, ముత్యాలు, కోటేశ్వరరావు, గౌరీశంకర్, నాగమణి, జి.పెంటయ్య, జకరయ్య, మామిడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా ఉద్యమిద్దాం

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధనుష్

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమైక్యంగా కలిసి పయనించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ హాల్లో ప్రత్యేక హోదా సాధనా సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో సాంఘిక న్యాయవేదిక కన్వీనర్ రమణమూర్తి మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు జరగాల్సిందే అన్నారు. ప్రముఖ న్యాయవాది, లయన్స్ క్లబ్ కార్యదర్శి నెల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ విభజన సమయంలో రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉండి భారీస్థాయిలో పార్లమెంటు సభ్యులు గెలుపొందితే ఆ మెజార్టీతో ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్లో నిలదీస్తానన్న నేటి అధికార పార్టీ నాయకుడు కనీసం నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. సిఐటియు కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు పూనుకుంటే జగన్, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కనీసం నోరెత్తకపోవడం దారుణమన్నారు. నాడు ఇచ్చిన హామీల అమలకు స్వచ్ఛంద సంస్థలు రాజకీయ పార్టీలు సమన్వయంతో మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టియు నాయకులు వెంకటేశ్వరరావు, లావేటి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం నాయకులు గండికోట వెంకటేశ్వరరావు, పెంకి అప్పారావు, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు దోకల రవితేజ, కె.గౌరీనాయుడు పాల్గొని మాట్లాడారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధనుష్

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కోరుకొల్లు గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ధాన్యం కల్లాలను కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే నగదు జమ చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. రైతులు ధాన్యం మిల్లులకు తరలించే సందర్భంలో ఆసరాగా వాలంటీర్లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఆర్‌బికెలో ఒక సీనియర్ విఆర్‌ఒ, ఆర్‌ఐను కస్టోడియన్లుగా నియమించినట్లు తెలిపారు. మిల్లులకు ధాన్యం రవాణా నిమిత్తం లారీలను సిద్ధంగా ఉంచామన్నారు. ధాన్యం రవాణాను ప్రభుత్వం చేపడితే ఏజెన్సీకి రవాణా ఖర్చులు చెల్లించడం జరుగుతుందన్నారు. అయితే రైతే స్వయంగా రవాణా, గన్ని బ్యాగులు, హమాలీలను ఏర్పాటు చేసుకుంటే గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు, అటవీ శాఖ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.యోగేంద్రకుమార్ బాబు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపిడిఒ పాల్గొన్నారు.



కోరుకొల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గ్రామం యూనిట్‌గా రక్షిత నీరు అందించాలి

ఎస్‌ఆర్‌కెఆర్ వర్క్‌షాప్‌లో నార్వే శాస్త్రవేత్త డాక్టర్ రజనీస్ కౌర్‌కాలే

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కలుషిత రహిత తాగునీరు అందించాలంటే పట్టణం లేదా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వమే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నార్వే దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ రజనీస్ కౌర్‌కాలే అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ వెట్ సెంటర్ ఆధ్వర్యంలో ఇండో యూరోపియన్ యూనియన్ దేశాల్లోని పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన స్ట్రాటజిక్ ప్లానింగ్ ఫర్ వాటర్ రిసోర్సెస్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ బయోటెక్నాలజికల్ ప్రాక్టీస్ (స్ప్రింగ్) పేరిట నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న పరిశోధనల్లో భాగంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి వెట్ సెంటర్ కోఆర్డినేటర్, స్ప్రింగ్ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాలే మాట్లాడుతూ కాలుష్య నివారణ బాధ్యత ప్రజలు కూడా తీసుకోవాలన్నారు. భారతదేశంలో అవసరానికి మించి పెస్టిసైడ్స్ ఉపయోగిస్తున్నారన్నారు. డెల్టా ప్రాంతంలో నెలకొన్న తీవ్రమైన సమస్యలు పంజాబ్‌లోనూ ఉన్నాయన్నారు. ఇప్పటికే బోనాలోని ఒక పరిశోధన సంస్థ వర్షపు నీటిని శుద్ధిచేసి తాగునీరుగా మార్చే ప్రక్రియ ప్రారంభించిందన్నారు. స్ప్రింగ్ ప్రాజెక్టు వచ్చే ఏడాదికి పూర్తవుతుందన్నారు. అనంతరం దీనిపై వ్యాపారాత్మకంగా ఆలోచించి కలుషిత రహిత నీటిని అందించేలా కృషి చేయాలని ఆమె కోరారు. నార్వేకు చెందిన సింటెఫ్ శాస్త్రవేత్త డాక్టర్ నాగ డాంగ్ మాట్లాడుతూ కాలుష్య కారకాలు మనుషుల దరి చేరకుండా మైక్రో బయాలజీ పరిశోధనలతో డ్రోన్లు, కృత్రిమ మేధా యంత్రాలను ద్వారా శుద్ధి చేయాలని సూచించారు. హంగేరీకి చెందిన ఎక్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జార్జ్ సిండర్, పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ థామస్ కోవేక్స్ మాట్లాడుతూ గంగా, గోదావరి వంటి నదులు పర్యావరణ హితంగా ఉండేలా కాలుష్య రహిత నీటిపై పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ యూరోపియన్ యూనియన్ దేశాలతో కలిసి ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త పరిశోధనలు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. త్వరలో యూరోపియన్ యూనియన్ దేశాలతో కూడా కలిసి ఎంఒయు చేసుకునేందుకు తమ కళాశాల ఆసక్తి కనబరుస్తుందన్నారు. స్ప్రింగ్ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు మాట్లాడుతూ స్ప్రింగ్ ప్రాజెక్ట్ ఫొటో టైప్ మోడల్‌ను పశ్చిమ డెల్టాలోనూ, భీమవరం మున్సిపల్ ట్యాంకుల్లోను ప్రయోగించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, జిల్లా వాటర్ రిసోర్సెస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగరాజారావు, పోర్ట్ ట్రస్ట్ మాజీ డైరెక్టర్ పాకా సత్యనారాయణ, రైతుసంఘం జిల్లా నాయకులు బి.బలరాం, డాక్టర్ కిషన్, డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూరోపియన్ యూనియన్ శాస్త్రవేత్తల బందం కళాశాల వెట్ సెంటర్లో జరుగుతున్న పరిశోధనలను, ఐడియా ల్యాబ్ లో విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు పరిశీలించి అంతర్జాతీయ స్థాయిలో ఎస్‌ఆర్‌కెఆర్‌లో పరిశోధనలు ఉన్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి రైతుసంఘ ప్రతినిధులు, నీటిపారుదల శాఖ, డ్రెయినేజీ విభాగం అధికారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నార్వేకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ రజనీష్ కౌర్ క్లే

అనుమతుల్లేకుండా తవ్వకాలు చేపడితే చర్యలు

మైనింగ్ శాఖ ఎడి జి.సునీల్‌బాబు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో అనుమతులు లేకుండా పూడికచేసిన లేఅవుట్లను మైనింగ్ శాఖ ఎడి జి.సునీల్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. అనుమతి పత్రాలను వారం రోజుల్లోపు తమకు సమర్పించాలని నోటీసులు జారీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా మైనింగ్ తవ్వకాలు చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, విఆర్‌ఒ వెంకటలక్ష్మి ఉన్నారు.



వివరాలు నమోదు చేస్తున్న మైనింగ్ శాఖ అధికారులు

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు మిన్ను


ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న జి.మిన్ను హ్యాండ్ బాల్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సత్యనారాయణ బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు కెపిడిటి హైస్కూల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో అండర్-17 విభాగంలో కోపల్లె హైస్కూల్ విద్యార్థి జి మిన్ను ప్రతిభ కనబరిచాడు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మిన్ను పాల్గొంటాడని ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి మిన్నును, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

విద్యార్థుల నైపుణ్యతకు క్రీడలు దోహదం

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడలు మరింత దోహదపడతాయని ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.జాన్సన్ అన్నారు. బుధవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయి అండర్-14 బాలుర, అండర్ 17 బాలుర, బాలికల బాక్సింగ్ పోటీలు పెనుమంట్ర హైస్కూల్లో జరిగాయి. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల నుంచి 60 మంది బాలబాలికలు బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. గెలుపొందిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం కె.సాయి సూర్యనారాయణరావు, విద్యా కమిటీ ఛైర్మన్ ద్వారంపూడి నాగిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు బివి సత్యతోపాటు ఆయా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొన్నారు.


పిహెచ్‌సి సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి మహేశ్వరరావు

వైద్య సిబ్బంది మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - ఆచంట

పిహెచ్‌సి వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు సూచించారు. బుధవారం ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ల్యాబ్, ఫార్మసీ రూమ్, డెలివరీ రూమ్, జనరల్ వార్డ్, ఇమ్యునైజేషన్ స్టోర్ రూమ్‌తోపాటు నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సిలో ఎక్కువగా ప్రసవాలు జరిగేటట్టు చూడాలని సిబ్బందిని సూచించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య విషయంలో ఎటువంటి సమస్య తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని పిహెచ్‌సికి వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజతో మాట్లాడి సూచనలు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మాలతీ

బాలల సంరక్షణపై సమీక్ష

ప్రజాశక్తి - పెనుమంట్ర

బాలల సంరక్షణకు, బాల్య వివాహాల నిరోధించేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ దోహదపడుతుందని ఇరగవరం తహశీల్దార్ మాలతీ అన్నారు. బుధవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఇరగవరం సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ కమిటీ గురించి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాలతీ మాట్లాడుతూ ఇక నుండి ప్రతి గ్రామంలో బాలల రక్షణ, బాలికలపై జరిగే అత్యాచారాలు, బాల్య వివాహాలను నిరోధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాస్, ఎస్ఐ చంద్రశేఖర్, సూపర్ వైజర్లు కాంత కుమారి, మాణిక్యాంబ, నాగలక్ష్మి పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

పోడూరులో పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి - పోడూరు

పోడూరు ఎంపిపి స్కూల్‌ను ఎంఇఒ ఎఎస్‌కెవి.ప్రేమ జ్యోతి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి తిని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తరగతులను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు ఎస్.బుజ్జి, రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు డి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు విజయ్ గోపాల్, బాలాజీ, రాజకుమారి పాల్గొన్నారు.

'మరోసారి టిడిపిని అధికారంలోకి తేవాలి'

ప్రజాశక్తి - కాళ్ల

టిడిపిని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం పెదఅమిరం గ్రామంలో నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గంలోని టిడిపి నాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉండి, భీమవరం, నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు, క్లస్టర్, యూనిట్, బూత్‌ల ఇన్‌ఛార్జులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ ఈసారి తెలుగుదేశం పార్టీ ప్రతి ఇంటికెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఉండి ఎంఎల్‌ఎ రామరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకునేందుకు 'ఇదేమి కర్మ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఇదేమి కర్మ కార్యక్రమం డిసెంబర్ ఒకటి నుంచి ప్రతి నియోజకవర్గంలో జరుగుతుందన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చి మూడున్నర సంవత్సరాలు అవుతున్న, ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి, భీమవరం నరసాపురం పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళల బుర్కాల తొలగింపు దారుణం


ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఈ నెల 21వ తేదీన నరసాపురంలో జరిగిన సిఎం పర్యటనలో ముస్లిం మహిళల బుర్కాలను తొలగించడం దారుణమని టిడిపి ముస్లిం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి మహబూబాబాద్ (జానీ) మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ విధానాలు చూస్తుంటే ముస్లిములపై కక్ష సాధింపు చర్యలుగా ఉన్నాయన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసుపలుకుతోందన్నారు. ముస్లిం మహిళలు గౌరవంగా ధరించే బుర్కాలను నిర్దాక్షిణ్యంగా తీసివేయడంపై పోలీసులకు అంత ఉత్సాహం ఎందుకన్నారు. రాబోయే ఎన్నికల్లో ముస్లింలంతా ఏకమై తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు ఎండి మౌలాలిఖాన్, ఎండి షాజహాన్, ఎస్‌కె కాజా ఖాన్, అక్తర్ అలీ, ఎస్‌కె సిలార్ సాహెబ్, టిడిపి పట్టణ కార్యదర్శి కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మల్లిపూడిలో రెండో రోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి నవరత్న పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షుడు కర్రి గోపాల కృష్ణారెడ్డి, నాయకులు గుడిమెట్ల గంగాధర్ రెడ్డి, దండు రామరాజు, నల్లిమిల్లి గోపి, పెనుమత్స విశ్వనాథరాజు, పెనుగొండ ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు), వైస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ్, తహశీల్దార్ దండు అశోక్ వర్మ పాల్గొన్నారు.


ప్రచార కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు


లక్ష్మీ నరసింహపురం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ ఆర్‌వి రమణ

నాడు - నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

పాఠశాలల్లో భవన నిర్మాణ పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్‌వి.రమణ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. లక్ష్మీ నరసింహ పురం, సత్యనారాయణపురం, బొండాడ, మాలవానితిప్ప, జువ్వలపాలెం, కాళ్లకూరు, కలవపూడి, మోడీ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ పట్టాభిరామయ్య, శ్రీనివాసరాజు, రామకృష్ణ, గాదిరాజు రామకృష్ణంరాజు, ఎంవి త్రినాధులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఇఒ శారదా జ్యోత్స్న

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న తెలిపారు. ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 వాలీబాల్ పోటీలు మార్టేరు హైస్కూల్లో హెచ్ఎం సిహెచ్ శివజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్-14 పోటీల్లో సదన్ శివసాయి టీం, అండర్-17లో మార్టేరుకు చెందిన డి.శ్రీనివాస్ టీంలను ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.జాన్సన్ ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డితోపాటు హైస్కూల్ ఉపాధ్యాయులు, ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చంద్రరావుకు సాయం అందజేస్తున్న జయలక్ష్మి

చంద్రరావుకు కొవ్వలి ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలని కొవ్వలి ఫౌండేషన్ ట్రెజరర్ జయలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని 15వ వార్డు పిచుపాలెంకు చెందిన గుంటూరు వెంకట చంద్రరావు అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా చంద్రరావుకు నెలకు సరిపడా మందులను కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయలక్ష్మి అందజేసి మాట్లాడారు. చంద్రరావు గత కొంతకాలం నుంచి వెన్నుముక విరిగి నరాలు పనిచేయక బాధపడుతున్నారన్నారు. ఆయనకు కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు స్నేహితులు ద్వారా చంద్రరావు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని ఇటీవల ఆర్థిక సాయంతో పాటు వైద్య సామగ్రి అందజేశామని అన్నారు. ఎప్పటికపుడు చంద్రరావు పరిస్థితిని తెలుసుకుంటున్నామని, అందులో భాగంగా నేడు చంద్రరావుకు మందులు అందించామని తెలిపారు. కొవ్వలి ఫౌండేషన్ ద్వారా విద్యా, వైద్య సేవలకు అధిక ప్రాధాన్యతిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడ్డగళ్ల సీతయ్య, సంకు భాస్కరనాయుడు పాల్గొన్నారు.


కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌జెడి శారద

ఆర్‌జెడిచే విఇసి జూనియర్ కళాశాల పరిశీలన

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎయిడెడ్ విఇసి జూనియర్ కళాశాలను బుధవారం ఆర్‌జెడి ఐ.శారద పరిశీలించారు. గత సంవత్సం ఎయిడ్‌డ్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా కళాశాల ఆస్తులు, సిబ్బంది తదితర వివరాలను ఆర్‌జెడి పరిశీలించారు. ఇప్పటికే కళాశాలను ప్రభుత్వానికి అప్పజెప్పేందుకు సంబంధిత యాజమాన్యం ప్రభుత్వానికి అంగీకారం తెలిపింది. ఇందులో భాగంగానే ప్రభుత్వం కొన్ని మార్గనిర్ధేశాలను జారీ చేసింది. ఆ నిర్ధేశాలను అనుసరించి కళాశాల ఆస్తులు, సిబ్బంది, బ్యాంకు ఖాతా తదితర వివరాలను ఆర్‌జెడి బృందం పరిశీలించింది. ఈ నివేదికను ఇంటర్మీడియట్ బోర్డు కమీషనర్‌కు నివేదించడం జరుగుతుందని ఆర్‌జెడి తెలిపారు. ఆయన వెంట డివిఇఒ శ్రీనివాసరావు, కళాశాల ప్రెసిడెంట్ వర్ధినీడి సత్యనారాయణలు పాల్గొన్నారు.

వైఎస్‌లో కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురంలోని వైఎన్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ శిక్షణ తరగతుల్లో బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల స్టాఫ్ సెక్రటరీ చింతపల్లి కృష్ణమోహన్ తెలిపారు. కళాశాల హెచ్‌ఆర్‌డి సిహెచ్ శ్రీనివాస్ పదో తరగతి ఉత్తీర్ణత అనంతరం తీసుకోవాల్సిన వివిధ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతులకు పాఠశాల సిబ్బంది సిహెచ్ రమా కె.మంగతాయారు తదితరులు పాల్గొన్నారని కృష్ణమోహన్ తెలిపారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం

భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలతో మమేకమై అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ తెలిపారు. ఇటీవల భీమవరం డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనాథ్ ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీస్ నేతృత్వంలో ప్రజలకు చేరువగా ఉండే విధంగా కార్యాచరణ రూపొందించామన్నారు. పట్టణంలో పెరుగుతున్న నేరాలను కూకటి వేళ్లతో పెకళిస్తామన్నారు. దీనికి ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. భీమవరం పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని నివారణకు చర్యలు తీసుకోనున్నామన్నారు. ద్విచక్ర వాహనాలపై చైన్ స్నాచింగ్ దొంగతనాలు, బహిరంగ ప్రదేశాలలో మద్యపానం, బెల్ట్ షాపులు నియంత్రణ వంటి నేరాలను అదుపు చేసేందుకు పోలీస్ సీసీ కెమెరాలను మరిన్ని పట్టణంలో వాడుకలోకి తీసుకురానున్నామన్నారు. సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యతిచ్చి సంక్రాంతి జరుపుకోవాలన్నారు.

బాధితునికి సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఇటీవల పూలపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు పెనుమంట్ర రామకృష్ణ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో పూలపల్లి కృష్ణ బలిజ సంఘం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంటా త్రిమూర్తులు కలిసి బుధవారం రూ.15 వేలను రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంటా వెంకన్న, పందిరిపల్లి భవాని, ఘంటా శ్రీనివాసు, సాయిబాబా, చేపల్లి వెంకటేశ్, మధుర, కోలా శ్రీనివాసు పాల్గొన్నారు.


వృద్ధునికి సాయం అందజేస్తున్న సభ్యులు

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి


ప్రజాశక్తి - మొగల్తూరు

కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు బొక్క చంటి డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం మొగల్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరుపాలెం నార్త్‌లో ఈ నెల 22న ప్రమాదవశాత్తూ కొబ్బరి చెట్టుపై నుండి పడి మృతి చెందిన గీత కార్మికుడు లక్ష్మీకాంతారావును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. 65 సంవత్సరాలు దాటిన కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం బీమా తదితర సౌకర్యాలు వర్తింపజేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే తక్షణ మట్టి ఖర్చు నిమిత్తం రూ.25 వేలు అందించి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. ప్రభుత్వం పాత పద్ధతిలో ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెన్షన్ రూ.2,500 నుండి రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం మొగల్తూరు అధ్యక్షులు గుబ్బల వెంకన్న, మాజీ అధ్యక్షులు గుబ్బల ముత్యాలు, కాగితాల సత్యనారాయణ, పాల సత్యనారాయణ, బొక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

జిల్లా వ్యాప్తం గా జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే సైన్సు ఎగ్జిబిషన్లు బుధ వారం ఆయా పాఠశాలల వద్ద ఘనంగా ప్రారంభ మయ్యాయి. మండలంలోని తోలేరు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ వంకాయల విజయకుమార్ సైన్సు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రధానోపాధ్యాయుడు, జిల్లా సైన్సు అధికారి విఎంజెడ్ శ్యామ్‌ప్రసాద్ తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనా పటిమను, ఆవిష్కరణాభిలాషను, సైన్సు పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి పాఠశాల నుంచీ నాలుగు ఉత్తమ ఎగ్జిబిట్లను ఎంపిక చేసి డిసెంబర్ 12, 13వ తేదీల్లో మండల స్థాయిలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలు జిల్లా స్థాయిలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు.


తోలేరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జిల్లా సైన్సు అధికారి శ్యాంప్రసాద్


మొగల్తూరు : ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నాగరాజు

మొగల్తూరు : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయని పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కె.నాగరాజు అన్నారు. ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించని పరిశ్రమలు, ఆరోగ్యం పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్ యాప్‌లు, పర్యావరణంలో మార్పులు, గణిత నమూనాల ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. స్టాఫ్ సెక్రటరీ చింతపల్లి కృష్ణమోహన్ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం జనవరి 27, 28 తేదీల్లో మండల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్లు జరుగుతాయన్నారు. పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులను సైన్స్ ఎగ్జిబిషన్లో తమ పాఠశాల నుంచి ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో ఎగ్జిబిషన్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రథమ సహాయకులు కోసూరి గోపాలకృష్ణంరాజు, కె.నాగరాజాకుమార్, ఐ.రామకృష్ణ, సిహెచ్. రమా, కె.మంగతాయారు, బి.పద్మావతి పాఠశాల ఇబ్బంది పాల్గొన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

కొత్త విధానంతో రైతుల అవస్థలు

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాలతో రైతులు విసుగెత్తిపోతున్నారని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. లంకలకోడేరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం దగ్గులూరు గ్రామం అయ్యప్పస్వామి గుడి వద్ద కళాల్లో ఆరబెడుతున్న ధాన్యాన్ని పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పగలనకా రాత్రనక ఆరుగాలం కష్టపడి పంట పండించినా ప్రభుత్వ నిబంధన వల్ల రైతులకు కష్టాలు తప్పడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొత్త విధానం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని, ఏవిధంగా ధాన్యం అమ్ముకోవాలో తెలియక నానా పాట్లు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పెట్టే విధానాలతో రైతాంగం విసుగెత్తి పోయారన్నారు. ప్రస్తుతం తిరుగుబాటు చేసే పరిస్థితిలో రైతులు ఉన్నారన్నారు. ఆయన వెంట రైతు మండల అధ్యక్షులు నెక్కంటి ఆదినారాయణ, చొప్పల వెంకట్రావు, కూడక కోటేశ్వరరావు, ఆకుల బ్రహ్మాజీ, దమ్మ వెంకటేశ్వరరావు, పెన్మత్స రామలింగరాజు, జవ్వాది వేణు గోపాలరావు పాల్గొన్నారు.

రేపు ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ విఎస్‌విఎల్ జగన్నాధరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విధిగా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారులంతా పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.


ఆచంటలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఆచంటలో అన్నదానం

ప్రజాశక్తి - ఆచంట

కార్తీకమాసం ముగింపు సందర్భంగా బుధవారం ఆచంట రామేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచంట మండల పరిసర ప్రాంతాల ప్రజలు సుమారు పదివేల మంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, వైసిపి నాయకులు వైట్ల కిషోర్‌కుమార్, కోట వెంకటేశ్వరరావు, పిచ్చెట్టి సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్ర కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లు : కార్తీక మాసం నేపథ్యంలో క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద రేపాకవారి సత్రంలో నెల రోజుల పాటు ఏర్పాటు చేసిన ఉచిత భోజన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. కార్తీక మాసం చివరి రోజు బుధవారం యాత్రికులు భారీగా ఆలయానికి విచ్చేసి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు అన్నదానం సజావుగా సాగేందుకు కృషి చేశారు. స్వామివారి నిత్యాన్నదానం కార్యక్రమాన్ని మంచి రోజు నుంచి ప్రారంభిస్తామని కోరాడ శ్రీనివాస్ చెప్పారు.

జగనన్న శాశ్వత భూహక్కుపై శిక్షణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

విలేజ్ సర్వే చేయాలంటే ఇంటి పన్నును నవీకరణ చేసుకొని నిర్వహించుకోవాలని ఇఒపిఆర్‌డి పివివిఎస్ రాంప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్న శాశ్వత భుహక్కు, భూ రక్షపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం తహశీల్దార్ దండు అశోక్‌వర్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, విలేజ్ సర్వేయర్, సచివాలయ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ విలేజ్ సర్వే చేసేటప్పుడు డ్రోన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పూర్ణ బాబ్జి, డిప్యూటీ తహశీల్దార్ ఏలియమ్మ, మండల సర్వేయర్ దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి హత్యకేసులో ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - మొగల్తూరు

వ్యక్తి హత్య కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.వీరబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 13న వీరవాసరం మండలం వీరవల్లి గ్రామానికి చెందిన కవురు కనక శ్రీనివాస్ 20 మంది మిత్రులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. పాత గొడవలను మనసులో పెట్టుకుని శ్రీనివాసును ఏడుగురు మిత్రులు కొట్టారు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం భీమవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలోని చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 19న శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడు భార్య చాముండేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. సిఐ వాడపల్లి సురేష్ బాబు కేసు విచారణ చేసి నిందితులు పిల్ల దిలీప్ దుర్గాకుమార్, తనింకి శ్రీరమేష్, పిల్ల మణికంఠ, దాడి ప్రసాద్, బళ్ల నరసింహమూర్తి, యాళ్లపు నాగప్రసాద్, సకిరెడ్డి భాస్కర వెంకటరమణను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.